

# చలికాలం నారుమడి జరపైలం

- వరినారుపై సస్యరక్షణ చర్యలు తప్పనిసరి
- మొక్కకు పోషకాలు అందేలా చూడాలి
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

సత్తుపల్లి/ సారపాక, డిసెంబర్ 10 : రైతులు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరగడంతో వరినారుకు తెగుళ్లు సోకే అవకాశం ఉంది. ఈ తరుణంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంట పొందవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈసారి వానకాలం కంటే యాసంగిలో రైతులు వరిపంటను అధికంగా సాగుచేసే అవకాశం ఉంది. ఈక్రమంలో లైసెన్సు కలిగిన దుకాణాల నుంచే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి రశీదును భద్రపర్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు మొలకెత్తకుంటే దుకాణదారుడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



## నారుమడిలో రక్షణ చర్యలివే..

- నారుపోసిన నాలుగైదు రోజుల తర్వాత కిలో యూరియా, రెండు కిలోల డీఏపీ, కిలో పొటాషియం చల్లాలి.
- చలి తీవ్రతతో నారుమడి ఎరుపురంగులోకి మారి చనిపోతుంది. దీని నివారణకు రెండు గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఆకుపచ్చ తెగులు కనిపిస్తే కార్బండిజం 1.5గ్రాములును లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి. మళ్లీ నాలుగైదు రోజుల వ్యవధిలో నారుమడి ఎరుపురంగులో ఫార్ములా-4, 5, రెండుసార్లు పిచికారీ చేయాలి. దీంతో సూక్ష్మధాతు లోపాలనునివారించవచ్చు.
- వరిపై కాండంతొలుచు పురుగు ప్రభావం ఉంటుంది. నారుమడి వేసిన 15 రోజులకొకసారి కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లాలి. రెండోవిడతగా నాటువేసే వారం ముందు మరోసారి చల్లాలి.

## సేంద్రియ పద్ధతిలో విత్తనశుద్ధి

- 5 గ్రాముల సూడోమోనాస్ పొడిని కిలో విత్తనానికి ఒక లీటరు చొప్పున కలుపుతూ 30 కిలోల విత్తనాలకు సరిపడే ద్రావణాన్ని తయారుచేయాలి. ఈ ద్రావణంలో విత్తనాలను 12 నుంచి 24గంటల పాటు నానబెట్టాలి.
- ఒకవేళ విత్తనాలు వేయదలిస్తే మొలకశాతం పెరగడానికి నత్రిక్‌ఆమ్లం 30మిల్లీలీటర్లను 50లీటర్ల నీటిలో కలిపి 12 గంటలు నానబెట్టాలి.
- ఈసీజన్‌లో చలితీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి మామూలు విధానం కంటే పొలంలో 10సెంటీమీటర్ల ఎత్తులో బెడ్‌ను ఏర్పాటు చేసి నారుపోయాలి. దీంతో చలినుంచి కొంత రక్షణ ఉంటుంది.

## రసాయనాలతో విత్తనశుద్ధి

- తడిపద్ధతి విధానంలో లీటరు నీటికి 1.5 గ్రాముల కార్బండిజం పొడిని కలిపి 30 కిలోలకు సరిపడా ద్రావణం తయారుచేసుకోవాలి. ఆ ద్రావణంలో 12 నుంచి 24 గంటల వరకు విత్తనాలు నానబెట్టాలి.
- పొడి విధానంలో మూడు గ్రాముల కార్బండిజం పొడిని కిలో విత్తనానికి బాగా పట్టించి చల్లుకోవాలి.

## నాటువేసే సమయంలో....

- 25 నుంచి 30 రోజుల నారును మాత్రమే నాటుకోవాలి.
- నాటువేసే సమయంలో నారు చివరి ఆకులను తుంపి నాటితే మంచిది
- నాటువేసే ముందు క్లోరోపైరిపాస్ 2.5 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలోకి కలిపి 50లీటర్ల ద్రావణాన్ని తయారుచేసుకోవాలి. ఈ ద్రావణంలో నారును నానబెట్టి నాటుకున్నట్లయితే రసం పీల్చేపురుగును అరికట్టవచ్చు.

## చలినుంచి కాపాడేందుకు...

- రాత్రివేళల్లో నారుమడిలో నీటిని తీసివేసి ఉదయాన్నే వెచ్చని బోరునీటిని పెట్టాలి.
- ఎత్తైన నారుమడిపైనే నారును పెంచాలి.
- మంచు ప్రభావంతో నారుమడి చనిపోతుంది.. కావున నారుమడి చుట్టూ కొంత ఎత్తులో కట్టెలను కట్టి వాటిపై పాత బట్టలు కానీ... పాలిథిన్ కవర్లు కానీ కప్పాలి.
- సూక్ష్మపోషకాల నివారణకు జింక్ సల్ఫేట్ ఫార్ములా-4, 5లను పిచికారీ చేయాలి. పై జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యకరమైన నారుమడితో అధిక దిగుబడులు సాధించవచ్చు.



### జాగ్రత్తలు పాటించాలి



యాసంగికి వరినార్లు పోసుకునే రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. విత్తనం మొలకెత్తే దశలో తెగుళ్లు సోకే అవకాశం ఉంటుంది. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రశీదులను భద్రపర్చుకోవాలి.

**– వై.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి, సత్తుపల్లి**

### నారుమడిని కాపాడుకోవాలి



ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. రైతులు చలితీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచిది. నారుమడికి అవసరమైన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం ఉంటుంది. నారుమడులకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

**– కర్పూరపు అనిల్‌కుమార్, ఏవో, బూర్గంపహాడ్**

---

## ఉచిత బస్సు ప్రయాణాన్ని

# మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

భద్రాచలం, డిసెంబర్ 10: ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపునిచ్చారు. భద్రాచలంలోని బస్టాండ్‌లో ఆదివారం ఆయన ఆర్టీసీ అధికారులతో కలిసి 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు కేవలం ఆధార్ కార్డు చూపించి ప్రయాణం సాగించవచ్చన్నారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ పీవో బస్టాప్‌కు వెళ్లి మహిళలతో ముచ్చటించారు. అనంతరం ప్రయాణికులతో కలిసి బస్సులో కొద్దిదూరం ప్రయాణం సాగించారు. ఎమ్మెల్యే వెంట దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీలు రేసు లక్ష్మి, కోదండరామయ్య, ఆర్డీవో మాలోతు మంగీలాల్, ఆర్టీసీ డీఎం రామారావు, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

**బ్రోచర్ ఆవిష్కరణ..**

రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఆదివారం ఆయన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌తో కలిసి ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తాను గతంలో ఇదే ఆసుపత్రిలో ప్రజలకు వైద్యుడిగా సేవలందించానని, మళ్లీ ఇదే ఆసుపత్రికి ఎమ్మెల్యేగా రావడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఆసుపత్రిలో పొరుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలూ వైద్యం చేయించుకోవడం విశేషమన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో సరిపడినంత మంది డాక్టర్లు, నర్సుల లేరని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మాలోతు మంగీలాల్, డీసీహెచ్ఎస్ రవిబాబు, ఆర్ఎంవో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, చర్ల ఎంపీపీ గీదా కోదండరామయ్య ఉన్నారు.




బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

---

## సంపదను సృష్టించి

# ప్రజలందరికీ పంచుతాం

- మహాలక్ష్మి పథకాన్ని ఇప్పటికే ప్రారంభించాం
- జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇండ్ల స్థలాలు
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం: మంత్రి తుమ్మల
- మ్యానిఫెస్టో హామీలన్నీ నెరవేరుస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మంత్రులు భట్టి, పొంగులేటి, కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి): ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములను వంద రోజుల్లో అమలు చేస్తామని, సంపదను సృష్టించి ప్రజలకు పంచి, ఆత్మగౌరవంతో బతికేలా పథకాలు అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆయనతో పాటు రాష్ట్ర వ్యవసాయం, సహకారశాఖ మార్కెటింగ్, చేనేత జౌళి పరిశ్రమలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారి ఆదివారం ఖమ్మం నగరానికి విచ్చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో తొమ్మిది స్థానాలను కైవసం చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు. తమ పార్టీ విజయాన్ని రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. గోదావరి జలాలను ఖమ్మం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రతిఒక్కరికీ రూ.10 లక్షల వరకు వర్తింపజేస్తామన్నారు. త్వరలో జిల్లాకు చెందిన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను అందజేస్తామన్నారు.

### 10లక్షల ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యం..

**రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఉమ్మడి జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగు జలాలు పారించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కబ్జాల బారిన పడిన రైతుల భూములను వారికే అప్పగిస్తామన్నారు. కబ్జాలు లేని ఖమ్మం జిల్లాగా తీర్చిదిద్దుతామన్నారు. పోలీసుల జులుం ఇక ప్రజలపై ఉండదన్నారు.

### ప్రతి హామీని 100శాతం పూర్తి చేస్తాం..

**రాష్ట్ర రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని ప్రతి హామీని పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతబంధు సొమ్మును త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు.



మంత్రులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

### జిల్లా సరిహద్దులో మంత్రులకు ఘన స్వాగతం

కూసుమంచి, డిసెంబర్ 10: మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మార్కెటింగ్, చేనేత జౌళి పరిశ్రమలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారి ఆదివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం జిల్లాకు విచ్చేశారు. వారికి నాయకన్‌గూడెం టోల్ ప్లాజాక వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంత్రులు వ్యాన్‌పై నించుని వారందరికీ అభివాదం చేశారు. వారి వెంట ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

---

**ఈనెల చివరివారంలో నిర్వహణ**

**ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లావిద్యాశాఖ**

**ప్రయోగాలు, పరిశోధనలపై యాజమాన్యాలకు డీఈవో సూచనలు**

**సరికొత్త ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేస్తున్న విద్యార్థులు**




# ఒకేసారి ఇన్‌స్పైర్.. సైన్స్‌ఫెయిర్

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 10: పుస్తకాల్లోని జ్ఞానం.. తరగతి గదిలో నేర్చుకునే పాఠం.. ఒక్కటే విద్యార్థుల అభివృద్ధికి దోహద పడవు. మేధోవికాసాన్ని వెలికి తీసి జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దాలంటే వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాల్సి ఉంటుంది. వారిని సరికొత్త ఆవిష్కరణల వైపు, పరిశోధనల వైపు మళ్లించేందుకు కృషి చేయాల్సి ఉంటుంది. అలా జరిగితేనే విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా తయారవుతారు. ఈ లక్ష్యంతోనే రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల విద్యార్థుల కోసం ఏటా ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా ఈ నెల చివరి వారంలో రెండు కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించేందుకు జిల్లావిద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే ఇన్‌స్పైర్‌కు 114 ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి. సైన్స్‌ఫెయిర్‌కు ప్రతి పాఠశాల నుంచి ఒక నమూనా అయినా ఉండాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. సాధారణంగా ఇన్‌స్పైర్, సైన్స్‌ఫెయిర్ నవంబర్ లేదా డిసెంబర్ నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల కారణంగా కార్యక్రమాలు కొద్దిగా ఆలస్యమయ్యాయి.

### 114 ప్రాజెక్ట్‌ల ఎంపిక..

2023-24 ఇన్‌స్పైర్ అవార్డ్స్ మేళాకు విద్యాశాఖ జిల్లావ్యాప్తంగా 114 ప్రాజెక్ట్‌లను ఎంపిక చేయింది. ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేలు మంజూరు చేసింది. ఇప్పటికే సొమ్ము వారి ఖాతాల్లో జమ అయింది. ఈ సొమ్ముతో వారు నాణ్యమైన ప్రాజెక్ట్‌లు తయారు చేసేందుకు అవకాశం ఉన్నది. సొమ్ము జమ కాని విద్యార్థులు వెంటనే తమ అకౌంట్ వివరాలు, కవరింగ్ లెటర్‌ను డీఈవో కార్యాలయంలో అందజేయాలి. ప్రదర్శనలకు ఉపాధ్యాయులు, యాజమాన్యాలు గైడ్ చేయాలి. పరిశోధనల ప్రదర్శనను జిల్లాస్థాయి సైన్స్ అధికారులు తొలుత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలనుకున్నారు. కానీ సైన్స్‌ఫెయిర్‌తో కలిపి నిర్వహించాలని తిరిగి నిర్ణయం తీసుకున్నారు.



### పరిశోధనలు చేసేలా..

పాఠశాలల్లో చదువుతున్న 10-17 ఏళ్లలోపు బాలబాలికలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేసేలా తీర్చిదిద్దాలన్నది జిల్లాస్థాయి జవహర్ లాల్ నెహ్రూ గణిత, సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎగ్జిబిషన్ లక్ష్యం.

### ఒక ప్రధాన అంశం.. ఐదు ఉప అంశాలు..

10 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసులోపు విద్యార్థులను జూనియర్స్‌గా, 15 సంవత్సరాల వయస్సు నుంచి 17 సంవత్సరాల వయస్సులోపు విద్యార్థులను సీనియర్స్‌గా నిర్వాహకులు పరిగణిస్తారు. ప్రదర్శనలో ప్రధాన అంశం 'పర్యావరణ ప్రదర్శన, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సోసైటీ'. ఉప అంశాలుగా హెల్త్, లైఫ్, అగ్రికల్చర్, కమ్యూనికేషన్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్, కాంపుటేషనల్ థింకింగ్ ఉంటాయి.

### ప్రాజెక్ట్‌లు ఇలా...

ఒకే పాఠశాల నుంచి ఎన్ని ప్రాజెక్ట్‌లు అయిన సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించవచ్చు. ఐదుగురు బాలలు జట్టుగా ఏర్పడి గైడ్‌గా ఒక టీచర్‌ను ఎంచుకోవచ్చు. అందరూ కలిసి ఒక మంచి ప్రాజెక్ట్‌ను ప్రదర్శించవచ్చు. విద్యాశాఖ మిల్లెట్స్ ఫర్ హెల్త్ అండ్ సస్టైనబుల్ ప్లానెట్ అంశంపైనా సెమినార్ నిర్వహించనున్నది.

### విద్యార్థులకు ఆసక్తి పెరిగింది..



జిల్లాలో ఏటా నిర్వహిస్తున్న సైన్స్‌ఫెయిర్‌కు ఆదరణ పెరిగింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్ట్‌ల రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

**– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి, ఖమ్మం**

### ప్రధానోపాధ్యాయులకు సూచనలిచ్చాం..



ఇన్‌స్పైర్-2023కి ఎంపికైన వారితో సైన్స్‌ఫెయిర్‌కు మంచి ప్రాజెక్ట్‌లు చేయించాలని ప్రధానోపాధ్యాయులకు డీఈవో సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సహకరించి ప్రాజెక్ట్‌లు సిద్ధం చేయాలన్నాం.

**– జగదీశ్వర్, జిల్లా సైన్స్ అధికారి, ఖమ్మం**